క్లుప్తంగా

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్వాతి పర్వదినం సందర్భంగా మండలంలోని నరసింహపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి వెండి కవచాలు, పట్టు వస్త్రాలు, కరెన్సీ నోట్లతో అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహిళల కోలాటం ఆందరినీ ఆకట్టుకుంది.

వృద్ధాశ్రమానికి రొట్టెల వితరణ



నిర్వాహకులతో మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి

కాశినాయన : మండలంలోని అమగంపల్లె బాలమ్మ సత్రంలోని వృద్ధులకు బద్వేలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లేరు విశ్వనాథరెడ్డి, పోకలమల్లికార్జునరెడ్డి గురువారం రొట్టెలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ బాలమ్మ సత్రానికి గతంలో సాయం అందించామని, ప్రస్తుతం రూ.2 లక్షల నిధులను వివిధ అభివృద్ధి పనులకు మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, వృద్ధులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష పుష్పార్చన



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి మూలమూర్తులు

పోరుమామిళ్ల : పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ద్వాదశ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, విశ్వక్సేన, గణపతి పూజలుచేసి అర్చకులు కిషోర్‌శర్మ స్వామిని అలంకరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామ మూల మూర్తులకు మహిళలు లక్ష పుష్పార్చన జరిపారు. భక్తులకు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు తులసి సురేష్‌బాబు, జనార్ధనశెట్టి, కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు.


పల్స్‌పోలియోను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వైద్యాధికారి

బి.కోడూరు : ఈ నెల 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్ తెలిపారు. బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ పోలియో చుక్కల కార్యక్రమంపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సునీల్‌కుమార్, సీహెచ్‌ఓ నాగమణి, పుష్పాంజలి, జాన్‌విలియం, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన ఆటాపాట



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని గౌతమీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గీతం నెక్సెస్–2024 ఎ టు డే నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోసియం గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నృత్యం, గానం, షార్ట్ ఫిల్మ్, స్కిట్, స్టాండప్ కామెడి, ఫొటోగ్రఫి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామసుబ్బమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూషా, ప్రకాష్ రావు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గత పాలకులు అభివృద్ధిని మరిచారు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : నియోజకవర్గంలో గత పాలకులు ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. గోపవరం పంచాయతీ పరిధిలోని భగత్ సింగ్ కాలనీలో ఐదు చోట్ల మురుగు కాల్వల నిర్మాణానికి ఎమ్మెల్యే గురువారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల వరదరాజులరెడ్డి పాతికేళ్లు ఎమ్మెల్యేగా, ఐదేళ్లు అధికార పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరించినా, మల్లెల లింగారెడ్డి ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా కాలనీల్లో వీధుల్లో మురుగు కాల్వలు లేవన్నారు. తాను అధికార పార్టీ ఎమ్మెల్యే అయ్యాక చాలా పనులు పూర్తి చేశానని, మరోమారు అవకాశం ఇస్తే జల్లెడ పట్టి అభివృద్ధి పనులు పూర్తి చేస్తానన్నారు. టీడీపీ నేతలు అధికారాన్ని అనుభవించేందుకు పోటీ పడుతున్నారని, తాను ప్రజా సేవ కోసం పరితపిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గద్ద మోషా, కె.దేవీప్రసాద్ రెడ్డి, ఓబయ్య యాదవ్, కొండయ్య, అజీమ్, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్యాలయానికి భూమి పూజ

దువ్వూరు రోడ్డులో నూతనంగా నిర్మించనున్న ఏపీజే అబ్దుల్ కలాం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం కార్యాలయానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రూ.35 లక్షలు వెచ్చించి 7 సెంట్ల స్థలాన్నిఅప్పగించడమేగాక, అక్కడ భవన నిర్మాణ సంఘం కార్యాలయం నిర్మాణానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్లదుర్తి రామాంజులరెడ్డి, పద్మపీరన్న, చెన్నారెడ్డి, నాగరాజు, శ్రీను, నల్లమేకల నాగరాజు, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందే పనులు పూర్తిచేయండి

ఎన్నికలకు ముందే అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ ఖాజా అధ్యక్షతన గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో 92 మంది మున్సిపల్ కార్మికుల వేతనాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిల్‌కు సూచించారు. పది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున అన్ని సమస్యలను జల్లెడ పట్టాలని కోరారు. చెత్త సేకరించే వాహనాల డ్రైవర్లకు 8 నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. మున్సిపల్ నిధుల నుంచి వేతనాలు చెల్లించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. 14, 15వ వార్డు కౌన్సిలర్లు జిలాని బాషా, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తమ వార్డుల పరిధిలోని డ్రైనేజి సమస్యలను సభ దృష్టికి తేగా తక్షణమే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా అధ్యక్షత నిర్వహించడం అభినందనీయమని ముస్లిం మైనారిటీ కౌన్సిలర్లు కమాల్ బాషా, జిలాన్ బాషా, వెల్లాల మహ్మద్ గౌస్, ఖలీలుల్లా తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి గైర్హాజరు కావడంతో ఆ స్థానంలో ఆయిల్ మిల్ ఖాజాకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అవకాశం కల్పించారన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మైనారిటీల కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకోలేదు

రాష్ట్రంలోని మైనారిటీ వర్గాల కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరులో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ మతతత్వ పార్టీ అనే ముద్ర ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి వారి హృదయాల్లో నిలిచిపోయారని, ఆయన మరణానంతరం జగన్ ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో 25వ వార్డు ఇన్‌చార్జి నూరి పాల్గొన్నారు.

రూ.30 కోట్లతో సంక్షేమ ఫలాలు

ముస్లిం మైనారిటీలు అత్యధికంగా నిర్వహించే 25వ వార్డుకు జగనన్న ప్రభుత్వం రూ.30కోట్లతో సంక్షేమ ఫలాలను అందించిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం 25వ వార్డు కౌన్సిలర్ షేక్ మహెనూర్ ఖాద్రి, వార్డు ఇన్‌చార్జి నూరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ఇంటింటా తిరిగి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌస్ బాషా, ఫారూక్, ఇస్మాయిల్, గఫార్, వడ్ల దాదాపీర్, కరీముల్లా, ఫరీద్, భీమునిపల్లి లక్ష్మీదేవి, ఖాజా, జిలాన్, కమాల్, గరిశపాటి లక్ష్మీదేవి, ఖలీల్, పిట్టా బాలాజీ, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, జేష్టాది శారద,కృష్ణవేణి, పోరెడ్డి నరసింహారెడ్డి, లక్కిరెడ్డి పవన్‌రెడ్డి, కాకర్ల నాగేషారెడ్డి, మార్కెట్ ఖాసీం, దాదాపీర్, పన్నీటి కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఈ ఎన్నికలు మంచికి చెడుకు మధ్య జరుగుతున్న యుద్ధం
- నాయకులకు జన నీరాజనం



పోరుమామిళ్ల ప్రచారంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

పోరుమామిళ్ల : నియోజకవర్గంలో నూటికి నూరుపాళ్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పోరుమామిళ్లలోని కాపు వీధిలో గురువారం పర్యటించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు జనం నీరాజనం పట్టారు. జయహో జగనన్న అంటూ నినాదాలు చేశారు. ముందుగా గంజే షాహిద్ దర్గాలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఆదిత్యరెడ్డి నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్ ఎంపీపీ బాష ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారం కొనసాగింది. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ 'ఈ ఎన్నికలు మంచికి చెడుకు జరుగుతున్న యుద్ధం' అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో పార్టీ నాయకులను గెలిపించాలన్నారు. కాపువీధి, రామాయణపువీధుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఫుడ్ కమీషన్ రాష్ట్ర చైర్మెన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, యువ నాయకులు డీసీ ఆదిత్యారెడ్డి, శింగమాల వెంకటేశ్వర్లు ముత్యాల ప్రసాద్, రవిప్రకాష్‌రెడ్డి, కల్లూరి రమణారెడ్డి, ఉప సర్పంచ్ రాళ్లపల్లె రవి, మాజీ రాళ్లపల్లె నరసింహులు, రాజీవ్‌బాష, చాపాటి లక్ష్మి నారాయణరెడ్డి, అల్లా, వెంగల్‌రెడ్డి, నేత గంగన్న, బూతప్ప, జేకే, మహబూబ్‌పీరా, కృష్ణారెడ్డి, ఇస్సాక్, తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల బలోపేతానికి కృషి

ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెలఝాన్సీరాణి



నూతన భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఝాన్సీరాణి, ఆదిత్యరెడ్డి

కలసపాడు : సహకార బ్యాంకులను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెలఝాన్సీరాణి పేర్కొన్నారు. మండలంలోని పుల్లారెడ్డిపల్లె వద్ద అంకాల పరమేశ్వరీ లేఅవుట్‌లో నాబార్డు నిధులతో నిర్మించిన కొత్తకోట సహకార పరపతి సంఘం భవనాన్ని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యారెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత డీసీసీ బ్యాంకులు లాభాల బాటలో నడుస్తున్నాయన్నారు. సహకార బ్యాంకులో 1600 పోస్టులు, జిల్లాలో 19 సీఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలో వాటి నియామకాలు చేపడతామన్నారు. బ్యాంకుకు వచ్చిన రైతులకు సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. అనంతరం భవన నిర్మాణానికి ఉచితంగా స్థలాన్ని ఇచ్చిన వారిని వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్లెలరాజారామ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, నారాయణయాదవ్, సుదర్శన్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, పులివీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గురయ్య, షరీఫ్, సింగరయ్య, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్ష రాయాలి



పరీక్ష సామగ్రి అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ సావిత్రి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థుల జీవితంలో పదో తరగతి ఓ మైల రాయి... ఒత్తిడి లేకుండా పరీక్ష రాసి ఉత్తీర్ణులవ్వాలని సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లోని 130 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్, హాల్ టికెట్ కవర్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఆదరణ సంస్థ సభ్యుడు బైసాని సత్యనారాయణ మాట్లాడుతూ సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో 1996వ బ్యాచ్ చదివిన తన తోటి మిత్రులు డాక్టర్ తేజానందరెడ్డి, డాక్టర్ శ్రీరంజన్, రియాజ్, స్టోన్లీ వినయ్ సహకారంతో పరీక్ష సామగ్రి అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సావిత్రి, గురప్ప, నాగరాజు, మాధవ, రాంబాబు, కుమారస్వామి, పవన్ పాల్గొన్నారు.

ఘనంగా సంజీవరాయస్వామికి పూజలు



ధ్యాన మందిరంలో సంజీవరాయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు పవన్

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్య క్షేత్రంలోని సంజీవరాయస్వామికి బాలాలయ కళాబింబ ఆవాహ పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈఓ బీవీ నరసయ్య ఆధ్వర్యంలో ప్రాంగణంలోని ధ్యాన మందిరంలో వేదపండితులు శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. స్వామి మూలవిరాట్‌ను కదపకుండా ఆలయ నిర్మాణం చేపడతామని ఈఓ చెప్పారు. ఆలయ పునర్నిర్మాణం అయ్యేంత వరకు ఈ బాలాలయంలో స్వామివారి మూలవిరాట్ దర్శన భాగ్యం భక్తులకు ఉండదని, ధ్యానమందిరంలో సంజీవరాయ స్వామిని ఆవాహన చేసుకుని స్వామి ప్రతిమతో కూడిన కళాబింబదారు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహానికి ప్రతి నిత్యం పూజలు, అభిషేకాలు, ఉత్సవాలు యధాతథంగా నిర్వహిస్తామని ఈఓ వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, వేదపండితులు మాధవాచార్యులు, శేషాచార్యులు, పవన్, సురేంద్ర పాల్గొన్నారు.

వైభవం ఆలయ శంకుస్థాపన మహోత్సవం

ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని భావనారాయణనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీతా, లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవి, శ్రీరాములు, సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, పుత్తామహేష్, యద్దారెడ్డి, డాక్టర్ బి.మునెయ్య, నాగేశ్వర్ రావు, చెన్నకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, ఓ.ప్రభాకర్ రెడ్డి, వార్డు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పథకాలు



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి

రాజుపాళెం : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పగిడాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు ఆయన తనయుడు రాచమల్లు రాఘవేంద్రారెడ్డి ఇంటింటా తిరిగి కరపత్రాలను పంచుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డిని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, శేఖర్ రెడ్డి, రాజారాంరెడ్డి, శివనాగిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

3న యాదవుల ఆత్మీయ మహాసభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : జమ్మలమడుగు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యాదవుల ఆత్మీయ మహాసభను ఈనెల 3న జమ్మలమడుగు నారాపురస్వామి ఆలయ రోడ్డు ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో (అలంకార్ థియేటర్) నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ తెలిపారు స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో యాదవుల ఆత్మీయ మహాసభకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే యాదవుల మహాసభకు ముఖ్య అతిథులుగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, యాదవులు హాజరువుతారన్నారు. నియోజకవర్గంలోని యాదవులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆ స్థలం జగనన్న కాలనీకి కేటాయించాలి



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న నాయకులు

గోపవరం : మండలంలోని బేతాయపల్లె పంచాయతీ గోపవరంలోని 1557 సర్వేనెంబరు పరిధిలోని ప్రభుత్వ భూమిని జగనన్న కాలనీకి కేటాయించాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి ఫోరం ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, జకరయ్య పేర్కొన్నారు. 1557 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూమిని ఫోరం సభ్యులతో కలిసి గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి ఇళ్లు నిర్మించుకున్నారని, బద్వేల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఇల్లు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. సెంచరీ పానెల్స్ పరిశ్రమ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని జగనన్న కాలనీకి కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. అర్హులైన పేదలకు గూడు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రపాల్, విజయరావు, సుబ్బరాయుడు, సుబ్రహ్మణ్యం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ కోసమే స్కౌట్ అండ్ గైడ్



నరహరిపురం హైస్కూల్‌లో ఏర్పాటైన స్కౌట్ అండ్ గైడ్ యూనిట్

చాపాడు : స్కౌట్ అండ్ గైడ్ లో విద్యార్థులు చేరితే నిస్వార్థ సేవ, క్రమశిక్షణ కలుగుతుందని స్కౌట్ జిల్లా కార్యదర్శి ప్రమీల అన్నారు. మండలంలోని నరహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్కౌట్ అండ్ గైడ్ నూతన యూనిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేయటం మంచి పరిణామమన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం నరసింహ శాస్త్రి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్సాహంగా స్కౌట్ అండ్ గైడ్ యూనిట్‌లో చేరారన్నారు. మంచి నడవడిక సేవా తత్వం వంటి అంశాలను వారికి అలవరిచేందుకు యూనిట్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌పల్లె, లక్ష్మీకర్, గౌరీలత, ప్రశాంతి, మురళీకృష్ణ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు



పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది



పరీక్షా సామగ్రి అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. భావన జూనియర్ కళాశాల, దీప్తి, శ్రీవిద్య, అభ్యాస్, షిర్డి సాయి, గీతం, విజ్ఞాన్, శారద, నారాయణ, ప్రభుత్వ జూనియర్, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు సంస్కృతం, తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షలు విద్యార్థులు రాయనున్నారు. పరీక్షల సందర్భంగా అన్ని పరీక్షల కేంద్రాల్లో బెంచీలపై హాల్ టికెట్ నెంబర్లు వేశారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

చాపాడు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలోని ఇంటర్ విద్యార్థినులకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. దాతల సాయంతో పేదలను ప్రోత్సహించేందుకు ఈ సామగ్రి అందజేశామని పేర్కొన్నారు. పరీక్షకు అవసరమైన పాడ్స్, స్కేల్స్, పెన్నులు, పెన్సిల్, ఫౌచులు తదితర స్టేషనరీని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటసురేష్, కేతన శ్రీనాథ్, కస్తూర్బా సిబ్బంది పాల్గొన్నారు.

దేవాంగులకు స్థలాన్ని కేటాయించాలి



ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న వుట్టి నాగశయనం తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవాంగులకు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని దేవాంగ సంక్షేమ సంఘం ప్రొద్దుటూరు పట్టణాధ్యక్షుడు వుట్టి నాగశయనం కోరారు. విజయవాడలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర దేవాంగ ఆత్మీయ సమావేశం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వుట్టి నాగశయనం మాట్లాడుతూ దేవాంగ సంఘానికి చెందిన 11 సెంట్ల పట్టా భూమిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 37వ సచివాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి దేవాంగ కౌన్సిలర్లకు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి వినతి పత్రం అందించారు.

ఉపాధి హామీ పనులపై సమావేశం



నివేదికలను చదివి వినిపిస్తున్న ఉపాధి సిబ్బంది

కలసపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ హాజరయ్యారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 801 పనులకు గాను రూ.4.92 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, ఆ పనులకు సంబంధించిన నివేదికలను ఉపాధి సిబ్బంది చదివి వినిపించారు. ఇందుకు అక్రమాలకు సంబంధించి రూ.23,605లు రికవరీ చేశారు. ఈ సమావేశంలో ఏపీడీ జుబేద, వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ వెంకటసుబ్బారెడ్డి, ఏపీఓలు శివశంకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, ఈఓపీఆర్‌డీ మురారి, సిబ్బంది పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ హరినారాయణ

ప్రొద్దుటూరు కల్చరల్ : యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన 3, 5 సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 3వ సెమిస్టర్ బీఎస్సీలో సుశీల్ కుమార్ 10కి 10 జీపీఏ సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అర్కటవేముల హరినారాయణ, ప్రిన్సిపాల్ మహమ్మద్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపాల్ శారద, రామ్మోహన్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు.

నేడు మడూరులో వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని మడూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. ప్రత్యేక వైద్యులతో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

మూగజీవాల భద్రతకే 1962 వాహనం



సంచార పశువైద్య వాహనాన్ని పరిశీలిస్తున్న కలీమ్

పోరుమామిళ్ల : మూగజీవాల ఆరోగ్య భద్రత కోసం 1962 సంచార పశు వైద్య వాహనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జీవీకే సంస్థ రీజనల్ ప్రోగ్రామ్ మేనేజర్ కలీమ్ అన్నారు. పోరుమామిళ్లలో 1962 వాహనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. సిబ్బంది అంకిత భావంతో పనిచేసి, రైతులకు మెరుగైన సేవలందించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. కలీమ్ మాట్లాడుతూ రైతులు టోల్‌ఫ్రీ నెంబర్ 1962కు ఫోన్ చేస్తే వాహనం వచ్చి రైతు ఇంటి వద్దే చికిత్స చేస్తుందన్నారు. ఏడీఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల్లో పశువుల యజమానులకు వాహనంతో గొప్ప ప్రయోజనం కలుగుతుందన్నారు. డాక్టర్ కొమ్మలపాటి అంజలి పాల్గొన్నారు